క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతోనే మేలు

భోగాపురం: ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని క్లస్టరు ఎమ్‌సీఏ పివి.గురుమూర్తి అన్నారు. మండలంలోని గూడెపువలస సర్పంచ్ మట్టా అయ్యప్ప కొబ్బరితోటలో బుధవారం ఆయన మొక్కజొన్న, కొబ్బరి మొక్కలలో ఉన్న కత్తెర పురుగు, ముప్వకుళ్లు తెగుళ్లు నివారించే అగ్ని అస్త్రంను తయారు చేశారు. కత్తెరపురుగు, ముప్వకుళ్లు తెగుళ్లు పట్టిన మొక్కలపై ఒక ట్యాంకుకు అర లీటర్ అగ్ని అస్త్రం కలిపి పిచికారీ చేసినట్లయితే తెగుళ్లను నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మట్టా ఇందుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక అంశాలపై అనుగ్రహ భాషణం



దనుర్మాస విశిష్టతను వివరిస్తున్న అహోబిల రామానుజ జీయర్‌స్వామి

విజయనగరం టౌన్: ధనుర్మాస వ్రత విశిష్టత, తిరుప్పావై పాశురాలు, స్వామివారికి కూడారై నివేదన, ఆధ్యాత్మిక చింతన తదితర అంశాలను అహోబిల రామానుజ జీయర్‌స్వామి భక్తులకు వివరించారు. స్థానిక ఆర్టీసీ కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా శ్రీవారి సేవకులు, వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు, స్వామివారిని కలిసి ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు అధిక సంఖ్యలోపాల్గొన్నారు.

శ్రీనివాసునికి కూడారై ఉత్సవం



కూడారై ఉత్సవ అలంకరణలో వైభవశ్రీ వేంకటేశ్వరస్వామి

విజయనగరం టౌన్: స్థానిక కంటోన్మెంట్ అరుంధతీనగర్‌లో కొలువైన వైభవశ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని బుధవారం వేకువ జాము నుంచి ఆలయ ప్రధాన అర్చకులు రాజేష్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు స్వామివారిని దర్శించి, తరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మునగ మొక్కల పంపిణీ



మునగ మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అరుణ

జామి: వెలుగు ఆధ్వర్యంలో లక్ష్మీపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో ఏర్పాటు చేసిన నర్సరీలో పెంచిన మునగ మొక్కలను డ్వాక్రా సంఘాల సభ్యులకు ఎంపీపీ సబ్బవరపు అరుణ, వైస్ ఎంపీపీ ఎన్నింటి విజయలక్ష్మి మంగళ వారం పంపిణీ చేశారు. ఒక్కొక్క మొక్కను రాయితీపై రూ.2 చొప్పున అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, వెలుగు ఏపీఎం మధుమహేష్, ఉపాధి హామీ పథకం ఏపీఓలు శేఖర్, కిరణ్మయి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

బొండపల్లి: మండలకేంద్రం బొండపల్లిలో బుధవారం జూదమాడుతుండగా పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామానికి సమీపంలో జూదమాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,810 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.18 లక్షలతో ఇంటింట కుళాయిలు



ఇంటింట కుళాయిలకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: మండలంలోని రామస్వామిపేట గ్రామంలో ఇంటింట కుళాయిల ఏర్పాటుకు సర్పంచ్ వడ్లమాని శర్మ ఆధ్వర్యంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.18 లక్షలతో ఇంటింట కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కృషితో మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింట కుళాయిల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అభివృద్ధే అభిమతంగా ముందుకు

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



సింగపూర్ సిటీలో నూతన రోడ్డులను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: విజయనగరం అభివృద్ధే అభిమతంగా ముందుకు వెళ్తున్నామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి రహదారుల ప్రారంభోత్సవాలు, పార్కు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపనలు చేపట్టారు. 6వ డివిజన్‌లోని సింగపూర్ సిటీ వద్ద 16 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన రహదారిని, 17వ డివిజన్‌లోని కాలనాయుడు మందిరం వద్ద 16 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన రహదారిని, 34వ డివిజన్‌లోని 22 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన పార్కు శంకుస్థాపనకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ నగరం కార్పొరేషన్ స్థాయికి ఎదిగిన పరిస్థితుల్లో అదే స్థాయిలో అభివృద్ధి ఏ విధంగా చేయాలో చేసి చూపిస్తున్న ప్రజా నాయకుడు కోలగట్ల వీరభద్ర స్వామిని కొనియాడారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో తెలుసుకోవడం ఒక ఎత్తయితే, గతంలో వార్డు పర్యటనలు చేపట్టి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత చూపిస్తున్నారని అన్నారు. నగరంలో అనేక ప్రాంతాలను ఇప్పటికే అభివృద్ధి చేశారన్నారు. ప్రకాశం పార్క్ ను ఆధునీకరించి త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేశారన్నారు. దుర్గంధ భరితంగా ఉండే బుచ్చన్న కోనేరు ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దారన్నారు. కార్పొరేటర్ అల్లు చాణక్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అవినీతి రహితంగా ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు అందిస్తున్నారన్నారు. అందుకు తగ్గట్లుగానే కోలగట్ల వీరభద్రస్వామి స్థానికంగా సంక్షేమం, అభివృద్ధిని సమపాళల్లో అందిస్తూ ప్రజాసేవకు అంకితం అవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ బంగారు నాయుడు, కార్పొరేటర్లు ఆల్తి సత్యకుమారి, గుజ్జల నారాయణరావు, పార్టీ నాయకులు కాళ్ల సూరిబాబు, కనకల గిరి,చిన్ని కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు ఆర్థిక పరిపుష్టిని సాధించాలి

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు



పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: పాడి రైతులు అన్ని వనరులను సద్వినియోగపరుచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. ఆయన స్వగ్రామమైన మొయిద విజయరామపురంలో విశాఖ డెయిరీ సమకూర్చిన దుప్పట్లను పాడి రైతులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వ్యవసాయం తరువాత ఆదుకునేది పాడి సంపదేనని.. పాడి రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలను అందిస్తోందన్నారు. పాడి రైతుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలోనూ పశువైద్య సిబ్బందిని నియమించారని వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సామాజిక సేవలో భాగంగా పాడి రైతులకు ఏటా దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని విశాఖ డెయిరీ ప్రతినిధుల సేవలను ప్రశంసించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన డెయిరీ చైర్మన్ ఆడారీ తులసీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు, డెయిరీ సూపర్‌వైజర్ గంగునాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ, నారాయణదాస స్మరణ

విజయనగరం క్రైమ్: రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో త్యాగరాజ, నారాయణదాస స్మరణ కార్యక్రమాన్ని బుధవారం స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణదాసు, త్యాగరాజు స్వామి చిత్రపటాలకు పూల మాలంకరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ డివి.శ్రీకాంత్, ఉసిరికల చంద్రశేఖర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



గర్భిణి ఆరోగ్యంపై ఆరా తీస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి శాంతకుమారి

గంట్యాడ: విధుల్లో నిర్లక్ష్యం వహించే అంగన్‌వాడీ సిబ్బందిపై చర్యలు తప్పవని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి బి.శాంత కుమారి అన్నారు. మండలంలోని కొర్లాం, తామరపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఆమె తనిఖీ లు చేశారు. ముందుగా బొత్సపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలు హాజరు, రికార్డులు పరిశీలించారు. ప్రీస్కూల్ నిర్వహిస్తున్నారా లేదా అని అంగన్‌వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో ఓ గర్భిణి ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్యంపై, అంగన్‌వాడీ కార్యకర్తలు గృహ సందర్శన చేస్తున్నారా, ఆరోగ్య నియమాలు గురించి చెబుతున్నారా లేదా అని ఆరా తీశారు. సకాలంలో వైద్య తనిఖీలు చేయించుకోవాలని గర్భిణికి సూచించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని చెప్పారు.

ప్రొసీడింగ్ పత్రాలు అందజేత



ఖాళీ స్థల యజమానికి ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న కమిషనర్ శ్రీరాములు నాయుడు

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఖాళీ స్థలాల పన్ను విధింపు ప్రక్రియలో వెల్లడించిన విధంగా 72 గంటలలోనే ప్రొసీడింగ్ పత్రాలను స్థల యజమానులకు కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు అందజేశారు. బుధవారం ఆయన చాంబర్లో ఖాళీ స్థల యజమానులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేసి, మిగిలిన వారు కూడా దరఖాస్తు చేసుకున్నట్లయితే పత్రాలను అందజేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈనెల 9 నుండి 13వ తేదీ వరకు ఖాళీ స్థలాలకు పన్ను విధింపు ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇలా దరఖాస్తు చేసుకుని అవసరమైన పత్రాలు సమర్పించిన వారికి దరఖాస్తు చేసుకున్న 72 గంటలలో ప్రొసీడింగ్ పత్రాల అందిస్తామని ప్రకటించిన విధంగానే అందజేశారు. ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ పత్రాల నకలు, 250 రూపాయల చలానా (కార్యాలయంలోనే లభించును), ఈసీ, ప్రస్తుత మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రాలు తెచ్చినట్లయితే పరిశీలించిన అనంతరం 72 గంటలలో ప్రొసీడింగ్ పత్రాలు అందించనున్నామని తెలిపారు.

సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

- సత్య కళాశాలలో వేడుకగా సంక్రాంతి సంబరాలు
- ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు



సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు

విజయనగరం టౌన్:

హైందవ సనాతన సంప్రదాయాలను భావితరాలకు అందించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు సూచించారు. తోటపాలెం సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. భోగి మంటలను వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. సంక్రాంతి పొంగలిని వండారు. గంగిరెద్దులకు పూజలు చేసి బట్టలు, పండ్లు, అందించారు. కళాశాల ఆవరణలో రంగోలి నిర్వహించారు. గాలిపటాలను ఎగురవేశారు. తెలుగమ్మాయి పోటీలను నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు సంక్రాంతి పాటలతో అలరించారు. సంప్రదాయ దుస్తులుతో సంస్కృతిని అద్దంపట్టేలా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందని కళాశాల డైరెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్ వి.సాయిదేవమణి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



ముందస్తు సంక్రాంతి వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులు

భోగాపురం: మండలంలోని ఉప్పాడపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేసి విద్యార్థులు దాని చుట్టూ తిరుగుతూ గొబ్బెమ్మ పాటలు పాడారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పడాల చంద్రశేఖరరావు మాట్లాడుతూ సంక్రాంతి పండగ నేపథ్యాన్ని, సంప్రదాయాల్ని కొనసాగించాల్సిన అవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపద్యాయులు గౌరీశంకర్, ఉమామహేశ్వరరావు, పీఈటీ రమణ, మహిళ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



విద్యార్థులను ఆశీర్వదిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు తదితరులు

డెంకాడ: మండలంలోని పలు పాఠశాలల్లో ముందుగానే సంక్రాంతి శోభ వచ్చేసింది. పాఠశాలలకు ఈ నెల 12 నుంచి సంక్రాంతి సెలవులు కావడంతో మండలంలోని అక్కివరం పంచాయతీలోని గొల్లపేట వద్ద మోడల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను బుధవారం నిర్వహించారు. దీనిలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ప్రిన్సిపాల్ సంధ్య, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రాము, పలు నాయకులు, ఉపాధ్యాయులు విద్యార్థులను దీవించారు. అలాగే గుణుపూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలను నిర్వహించారు. పలురకాల వేషధారణలు, సాంప్రదాయ వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భావితరాలకు సంప్రదాయాలు అందించడమే లక్ష్యం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాజీ చానెల్ ఎండీ శ్రీనివాసరావు

విజయనగరం టౌన్: సనాతన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందజేయడమే లక్ష్యంగా వాజీ చానెల్ గత 27 సంవత్సరాలుగా రంగోలీ పోటీలను నిర్వహిస్తూ వస్తోందని వాజీ చానెల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వాజీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ఆనంద గజపతి ఆడిటోరియంలో రంగోలీ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది రంగోలి పోటీల్లో రూ.4 లక్ష 50 వేల విలువ కలిగిన 750 బహుమతులను విజేతలకు అందించనున్నామన్నారు. ఈ పోటీల్లో ముగ్గు వేసే ప్రతి ఒక్కరికీ బహుమతి అందించనున్నామన్నారు. బహుమతి ప్రధానోత్సవంలో ప్రముఖ టీవీ, సీనీ ఆర్టిస్ట్ జ్యోతి రాయ్ (గుప్పెడంత మనసు ఫేమ్ జగతి) పాల్గొననున్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఆనందగజపతి ఆడిటోరియంలో వాజీ రంగోలీ, హౌసీ విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందన్నారు.

దివ్యాంగులు ముందుకు సాగాలి



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందచేస్తున్న ఎంపీపీ కల్యాణి

పూసపాటిరేగ: దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రత్యేక అవసరాలు పిల్లలకు ట్రైసైకిళ్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక అవసరాలు పిల్లలకు అండగా వుంటున్నారని చెప్పారు. దివ్యాంగులు ప్రయాణం చేయడానికి ట్రైసైకిళ్లు, వినికిడి లోపంతో బాధపడుతున్న దివ్యాంగులకు వినికిడి యంత్రాలు అందించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ భాస్కరరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనువాసరావు, మహంతి జనార్దనరావు, టొంపల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజల సంతోషం



గడప గడపకు కార్యక్రమంలోపాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ప్రజల చెంతకి ప్రభుత్వ పథకాలు చేరడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని నాల్గవ డివిజన్ నాల్గవ సచివాలయ పరిధిలో మంగళ వీధి కాలనీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒక రకమైన ప్రభుత్వ పథకం అందుతూ ఉండటంతో ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతుందన్నారు. జోనల్ ఇన్‌చార్జిలు ముద్దాడ మధు, ముచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ అవినీతి రహితంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు మంజూరు అవుతున్నాయని అన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రశ్నిస్తుంటే వారిలో ఆనందం వ్యక్తం కావడం సంతోషంగా ఉందన్నారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రజలకు రెండు కళ్లుగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్నారని కొనియాడారు. ఈ పర్యటనలో నగర మేయర్ శ్రీమతి వెంపడాపు విజయలక్ష్మి, కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమాతో ఆర్థికంగా చేయూత



బాధితులకు వైఎస్సార్ బీమా సొమ్మును అందజేస్తున్న జెడ్పీటీసీ సన్యాశినాయుడు

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్ బీమా సొమ్ముతో బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూతను అందిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడ గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు బాధిత కుటుంబ సభ్యులైన కోట్ల పైడిరాజు, బాలి అప్పలనారాయణకు రూ.లక్ష చొప్పున వైఎస్సార్ బీమా సొమ్మును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారని.. ప్రజల కష్టాల్లో తోడుగా, నీడగా ఉంటున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. బీమా సొమ్మును సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అక్కోజీ, వల్లూరి రాము, కార్యదర్శి రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల అభ్యున్నతికి కృషి చేయాలి



శిక్షణకు హాజరైన గ్రామైక్య సంఘాల కార్యవర్గ సభ్యులు

చీపురుపల్లి: డ్వాక్రా సంఘాల అభ్యున్నతికి గ్రామైక్య సంఘం కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని సెర్ప్ అధికారులు ఆన్‌లైన్ ద్వా రా అవగాహన కల్పించారు. మండలంలోని 35 గ్రామైక్య సంఘాల కార్యవర్గ సభ్యులకు రెండు రోజుల పాటు జూమ్ ద్వారా నిర్వహించనున్న శిక్షణ స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ప్రారంభమైంది. సంఘాల పనితీరు, రికార్డుల నిర్వహణ, బ్యాంకు లింకేజ్ రుణాలను సద్వినియోగం చేసుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో జీవనోపాధులను ఏర్పాటు చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఏపీ జి.సీతారామయ్య, డీపీఎం రవి, ఏపీఎం ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి వాలీబాల్ పోటీలు

కొత్తవలస: ఫర్ ది పీపుల్ ట్రస్టు, వసంత్ విహార్ సంయుక్తంగా ఈనెల 13వ తేదీ నుంచి మండల కేంద్రం సమీపంలోని వసంత్ విహార వద్ద మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లుకు వరుసగా రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3వేలు చొప్పున నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.